ఇంటి వద్దే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

- 18 సంవత్సారాలు నిండిన ప్రతి ఒక్కరికి పరీక్షలు
- నెలాఖరు వరకు కొనసాగనున్న సర్వే
- స్క్రీన్‌నింగ్‌తో క్యాన్సర్ లక్షణాలు గుర్తింపు
- ముందస్తు చికిత్స నివారణ సాధ్యం
- ముఖ్యంగా మహిళలకు ఎంతో ఉపయోగం




క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

మంగళగిరి: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్ సాధ్యం అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. గురువారం నుంచి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి 18 సంవత్సారాలు నిండిన ప్రతి ఒక్కరికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సమాచార నిక్షిప్తానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. సిబ్బందికి ప్రత్యేక శిక్షణనిచ్చిన అధికారులు.. సర్వేను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య శాఖ సర్వే ప్రకారం క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో సంబంధిత క్యాన్సర్ రోగులు మరణాలకు కారణమవుతోంది. క్యాన్సర్ మహమ్మారిని ఎదర్కోవాలంటే ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ లక్షణాలకు గుర్తించడం ద్వారా క్యాన్సర్ బాధితుల మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు.

క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రధానం

ఒక వ్యక్తిలో క్యాన్సర్ కణాల కోసం వెతకడాన్నే క్యాన్సర్ స్క్రీనింగ్ అని పిలుస్తారు. క్యాన్సర్ నివారణ, ముందస్తు రోగ నిర్ధారణకు మెరుగైన ఫలితాల కోసం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉపయోగపడతాయి. క్యాన్సర్ లక్షణాలు ప్రాథమిక స్థాయిలో గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆయుష్మాన్ భారత్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. మహిళలు ఎక్కువగా గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు.

క్యాన్సర్ పరీక్షల కోసం 18 సంవత్సారాలు నిండిన మహిళల వద్దకు వెల్లి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని, ఆన్‌లైన్ చేస్తారు. వీటితో దంత పరీక్షలు సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముందుగా అవగాహన కల్పిస్తారు. ఈ నెల నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. నియోజకవర్గంలోని మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థతో పాటు దుగ్గిరాల మండలంలోని రెండు లక్షల మందికిపైగా ప్రజలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మహిళలకు ఉపయోగం..

క్యాన్సర్ స్క్రీనింగ్‌తో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. ఎక్కువగా మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌లతో బాధపడుతున్నారు. వారు ఈ పరీక్షలతో సత్ఫలితాలను పొందవచ్చు. ఈ నెలాఖరు వరకు ఇంటింటికి తిరిగి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– పి.అనూష, వైద్యురాలు, గణపతినగర్ పీహెచ్‌సీ

క్లుప్తంగా

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

ఫిరంగిపురం: చేతులు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 67 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పదిమంది గర్భిణులకు షుగర్, బీపీ, మూత్రం, థైరాయిడ్ పరీక్షలు చేసి, మందులు అందించారు. ఈ సందర్భంగా వారికి శుభ్రత గురించి వివరించారు. ఆహారం తీసుకునేముందు చేతులు శుభ్రంగా కడుగుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. గర్భిణులు క్యారెట్, పాలు, గుడ్లు, ఆకు కూరలు తమ ఆహారంలో తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా రక్తహీనత లేకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, మేల్ అసిస్టెంట్ బాబురావు, ఏఎన్‌ఎం ఆర్. ఆంథోనిరాణి, ఆశ కార్యకర్తలు సుజాత, పద్మ, శాంతకుమారి, శాంతరాణి, జోజమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలీ శాఖా గ్రంథాలయంలో గురువారం 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసి పుస్తకాల ఆవశ్యకత గురించి విశ్రాంత ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్ బాబు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పోతురాజు, కె.ప్రాన్సిస్‌రాజు, డి.కృష్ణమూర్తి, షేక్.సైదా సాహెబ్ పాల్గొన్నారు.

నేడు సువర్ణ లింగానికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటి లింగాల మహాకాళేశ్వర ఆలయంలో కార్తిక పౌర్ణమి విశేష పూజలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. మహాకాళేశ్వరుడు, మహాకాళీ మాతకు పంచామృతాలతో మహన్యాసపూర్వక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అంగుష్టం సైజులో(బొటన వేలు) ఉన్న సువర్ణ మహా లింగానికి భక్తుల స్వహస్తాలతో అభిషేకాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం కోటి లింగాలకు కోటి ఒత్తులతో కార్తిక దీపాలు, జ్వాలాతోరణం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో భక్తులతో వెలిగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాలు ట్రస్టు చైర్మన్ స్వామిజ్ఞాన ప్రసన్న బాబా పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ

మేడికొండూరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, పంచాయితీ రాజ్ శాఖ ఆదేశాలతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీటఏలకు గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమం మండల అభివృద్ధి అధికారి తోట చందన ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి శిక్షణ ప్రారంభించారు. శిక్షణలో 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, 9 సంకల్ప్ థీమ్‌లను సాధించడానిక సమగ్ర తయారీపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో మండల పరిషత్ అధ్యక్షురాలు స్వప్న రాజేష్, డీఎల్‌డీఓ పిచ్చిరెడ్డి, డిఎల్‌పిఓ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి పూర్ణ శంకర్ రావు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని యువకుడి మృతి

లాం(తాడికొండ): అతివేగం నియంత్రించలేక ద్విచక్ర వాహనాన్ని చెట్టుకు ఢీకొట్టడంతో యువకుడుకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తాడికొండ మండలం లాం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లాం గ్రామానికి చెందిన షేక్ బాజీ (17) గుంటూరు వెళ్లి పనులు పూర్తిచేసుకొని బుధవారం రాత్రి 10:20 గంటల సమయంలో తిరిగి వస్తుండగా ఆర్కా కళాశాల ఎదుట మలుపులో ద్విచక్ర వాహనం నియంత్రణ కోల్పోయి చెట్టుకు బలంగా ఢీకొట్టడంతో త్రీవ గాయాలయ్యాయి. బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని 108 ద్వారా జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా రాత్రి 11:09 గంటలకు మరణించినట్లు ధృవీకరించారు. మృతుడి చెల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వాసు తెలిపారు.

కుర్చీలు, బెంచీలు వితరణ

కంతేరు(తాడికొండ): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ మండలం కంతేరు గ్రామంలో పూర్వ విద్యార్థులు తమ పాత శాలలకు రూ.1 లక్ష విలువ చేసే బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థి కీర్తి శేషులు వాసిరెడ్డి అశోక్ కుమార్ /ాపకార్థం వారి కుటుంబ సభ్యులు, చిన్ననాటి స్నేహితులు కలిసి అందజేశారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

మంగళగిరి: ఈ నెల 17న పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. శ్రీ మార్కేండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 41వ వార్షికోత్సవం సందర్భంగా తెనాలి రోడ్డులోని మార్కేండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో చేనేత వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతం

మంగళగిరి: పట్టణంలోని పాతమంగళగిరి జాతీయ రహదారి వెంట కల కనకదుర్గ ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతంలో పాల్గొనేవారు పూజా సామగ్రితో వ్రతంలో పాల్గొనాలని తెలిపారు.

కళా వేదిక ప్రారంభం

తాడేపల్లిరూరల్ : పెనుమాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కళా వేదికను దాత, వైఎస్సార్ సీపీ పెనుమాక రూరల్ అధ్యక్షుడు మేకా దామేశ్వర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. గతేడాది పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కళావేదిక అవసరమని తెలియజేశారని చెప్పారు. తన తండ్రి మేకా శివారెడ్డి జ్ఞాపకార్థం కళా వేదికను రూ.5లక్షలతో నిర్మించామని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరించారు.

మధుమేహం, క్యాన్సర్ పై అవగాహన



అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి డీఎంహెచ్‌ఓ కె. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఏసీడీసీ (3.0) కార్యక్రమాన్ని నిర్వహించామని, ప్రతి ఇంటికి ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు వెళ్లి 18 సంవత్సరాలు నిండిన మహిళలకు, పురుషులకు క్యాన్సర్, మధుమేహ వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తూ పరీక్షలు నిర్వహించారని తెలిపారు. సహజంగా దొరికే పండ్లు, ఆకుకూరలు, పచ్చి కూరగాయలు తీసుకోవడం ద్వారా మధుమేహ వ్యాధిని దూరం పెట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పి. శాంత కుమారి, డాక్టర్ ఎం. అనూష, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో క్యాన్సర్‌పై అవగాహన

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం, గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్, ఎంపీడీఓ శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ప్రతి ఇంటికి వెళ్లి 18 సంవత్సరాలు దాటిన వారికి షుగర్, బీపీ, రక్తశాతం, నోటిలో, బ్రెస్ట్, గర్భాశయంలో క్యాన్సర్‌కు సంబంధించిన అనుమానిత లక్షణాలను గుర్తించడం జరుగుతోందన్నారు. దీని ద్వారా తొలి దశలో ఉన్న క్యాన్సర్ వ్యాధిని గురించి మెరుగైన వైద్యం అందించడం ద్వారా క్యాన్సర్ నివారణ సాధ్యమవుతుందన్నారు. హెల్త్ స్టాఫ్ వచ్చినప్పుడు వారు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పి సహకరించాలని కోరారు. వైద్యులు డాక్టర్ అబ్దుల్ రహమాన్, డాక్టర్ ఇందిర, ఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన

మంగళగిరి: ఇందిరానగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మధుమేహ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష మాట్లాడుతూ ప్రతి రోజు 30 నిముషాల వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా మధు మేహ వ్యాధికి కొంత మేర దూరంగా ఉండొచ్చన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. రాత్రి సమయంలో చపాతి, జొన్నరొట్టె, గోధుమ రవ్వతో చేసిన పదార్థాలను తీసుకుంటే షుగర్ కంట్రోల్‌లో వుంటుందన్నారు. అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. షుగర్ వ్యాధి పరీక్షలు చేయించుకుని మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ సుమంత్, సిబ్బంది పాల్గొన్నారు.

స్కేటింగ్ క్రీడాకారులకు అభినందన



మంగళగిరి: ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి 36 వ స్కేటింగ్ పోటీలలో మెడల్స్ సాధించిన స్కేటింగ్ క్రీడాకారులను మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్ అలీంబాష అభినందించారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో స్కేటింగ్ క్రీడాకారులు హాషిష్, లిఖిత్‌లను అభినందించి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం (క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్) ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ కులముల వారికి చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐడీ అడిషనల్ ఎస్పీ ఆదినారాయణ పాల్గొని మాట్లాడారు. ఎస్సీ,ఎస్టీలకు ఉన్నత విద్యాభ్యాసం, చట్టాలపై అవగాహన, కోర్టులో ఎలా న్యాయం పొందాలనే దానిపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.మెల్కియా, కె.సాల్మన్‌పాల్, యోహాను, పి.రాజు, సీఐలు శివరామకృష్ణ, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

రేపట్నుంచి 'నిర్మల'లో సాహిత్య, లలిత కళా పోటీలు

ఆత్మకూరు(మంగళగిరి): నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట కల నిర్మల పాఠశాలలో సాహిత, లలిత కళల పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌పాల్ తెలిపారు. ఈ పోటీలలో ఆంధ్ర, తెలంగాణ , తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి 28 పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

40 సిలిండర్లు పట్టివేత

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని ఓ ఇంటిలో రెండు హోటళ్లలో సివిల్ సప్లయ్ అధికారి దేవరాజ్, రెవెన్యూ సిబ్బంది గురువారం సాయంత్రం తనిఖీలు చేసి 40 సిలిండర్లు పట్టుకున్నట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. రామాలయం వీధిలో అక్రమంగా ఓ ఇంటిలో ఫిల్లింగ్ చేస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేసామని 10 కమర్షియల్ సిలిండర్లు, 21 డొమస్టిక్ సిలిండర్లు గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని న్యూతాజ్ హోటల్, మరియు కార్తికేయ హోటళ్లలో తనిఖీ చేయగా 9డొమాస్టిక్ సిలిండర్లును గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు చెప్పారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తాలి

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తాడేపల్లిరూరల్: ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగళమెత్తడం కమ్యూనిస్టుల కర్తవ్యమని గుంటూరు జిల్లా సీపీఎం కార్యదర్శి పాశం రామారావు అన్నారు. గురువారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఇటీవల ప్రభుత్వాలు పెంచిన గ్యాస్, పెట్రోల్, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, ముక్కుపచ్చలారని బాలికలపై అత్యాచారాలు, హత్యలు చేస్తేంటే ఈ దేశం ఎటుపోతోందని ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉచిత ఇసుక విధానం నేటికీ పూర్తిగా అమలులోకి రాలేదని, భవన నిర్మాణ కార్మికులు పనులు కోల్పోయి ఇంట్లో ఖాళీగా కూర్చుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చి, గెలిపించిన ప్రజలపై దాడి చేయడానికి పోలీసులకు కొత్తగా శిక్షణ ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఐద్వా నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, ఐద్వా నాయకులు ఉష, నాయకులు కొట్టే కరుణాకరరావు, ఎస్కే బాష, ఎల్. సత్యం, పి.రామచంద్రరావు, ప్రభాకర్, గిరిజ, డివి భాస్కర్ రెడ్డి, వై.బర్నబాస్, పల్లె కృష్ణ, పాల్గొన్నారు.

అప్పు కాదు గ్రాంటుగా ఇవ్వాలి

తాడికొండ: రాజధాని అభివృద్ధికి అప్పుగా కాకుండా కేంద్ర ప్రభుత్వం గ్రాంటుగా ప్రభుత్వానికి ఇవ్వాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం నిర్వహించిన ప్రజా పోరు ముగింపు సందర్భంగా తుళ్ళూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నానాటికీ పెరుగుతున్న నాత్యావసర వస్తువల ధరలను అరికట్టాల్సిన అవసరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎంతైనా ఉందన్నారు. తహసీల్దారు కార్యాలయంలో డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



బాలల దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి, సిస్టర్ వొట్టి థెరసమ్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలల దినోత్సవం విశిష్టత గురించి వివరించారు. విద్యార్థులకు పలు రకాల ఆటలు, పాటల, గాత్రపోటీలు నిర్వహించారు.

సీకే హైస్కూలులో బాలల దినోత్సవం

మంగళగిరి: పట్టణంలోని మెయిన్ బజార్‌లోని సీకే హైస్కూలులో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీతా కిరణ్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు నెహ్రూ చిత్రపటంతో ఉన్న కాయిన్స్ పంపిణీ చేశారు. రామనాథం పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమాథాన్‌లో కేఎల్‌యూ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ పార్థసారథి వర్మ

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు భీమాథాన్ పోటీలలో ఆలిండియా స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు సివిల్ ఇంజనరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి. పోలురాజు తెలిపారు. గురువారం యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోడాక్టర్ పి. పోలురాజు మాట్లాడుతూ తెలంగాణలోని నర్సాపూర్ బీవీ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన ఇన్నోవాక్ 2024 జాతీయ స్థాయి 24 గంటల భీమాథాన్‌లో విద్యార్థులు కె. సూర్య, మాధవరావు, జ్ఞానేశ్వరులు పాల్గొన్నట్లు తెలిపారు. రివిట్ ఆర్కిటెక్చర్ సాఫ్ట్‌వేర్ ద్వారా అత్యాధునిక 3డీ భవన నమూనాలను సృష్టించడం ద్వారా రెండవ ర్యాంకు సాధించి సంచలనం సృష్టించారన్నారు.

విజయం సాధించిన విద్యార్థులను, విభాగ ఆచార్యులను వర్శిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, అకడమిక్స్ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎస్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కె.ఆర్‌ఎస్. ప్రసాద్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.పోలురాజు, అసోసియేట్ డీన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. బ్రహ్మాచారి అభినందించారు.

గ్రంథాలయ వారోత్సవాలు



వారోత్సవాలలో పాల్గొన్న విద్యార్థులు



గ్రంథాలయ విశిష్టతను వివరిస్తున్న హెచ్‌ఎం తాతిరెడ్డి

నూతక్కి(మంగళగిరి): నూతక్కి గ్రంథాలయంలో గురువారం 57వ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు వల్లూరి భారతీదేవి, జొన్నల శివరామిరెడ్డి, సాంబిరెడ్డి, నాగిరెడ్డి, లైబ్రేరియన్ ఎస్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని శివాలయం పక్కన కల లైబ్రరీలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు.

గ్రంథాలయాల్లో జ్ఞానం దొరుకుతుంది

తాడేపల్లిరూరల్ : గ్రంథాయాల్లో, విద్యాలయాల్లో మాత్రమే జ్ఞానం దొరుకుతుందని తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. తాతిరెడ్డి అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు రమేష్, శారద, జోత్స్న, డి. శ్రీవల్లి, గ్రంథాలయాధికారి నాగూర్ బాషా పాల్గొన్నారు.

వారోత్సవాలు ప్రారంభం..

తాడికొండ: గ్రంథాలయాలను ఉపయోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని తాడికొండ సర్పంచ్ తోకల సరోజినీ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం తాడికొండలోని శాఖా గ్రంథాలయం, మహిళా గ్రంథాలయంలో వేడుకలను ఆమె ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయాధికారులు జి శ్రీనివాసరావు, ఎ నాగమల్లేశ్వరి, కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, యెమేశ్వరరావు, బాబురావు, ఉదయ్ భాస్కర్ రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మేడికొండూరు: మేడికొండూరు గ్రామంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారి సుధారాణి గురువారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడికొండూరు గ్రామ సర్పంచ్ పోలా నాగమణి పాల్గొన్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తాడికొండ: వివాహిత అదృశ్యంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. ఫణిదరం గ్రామానికి చెందిన గండికోట శ్రీదేవి 13వ తేదీ ఇంటి నుంచి కనిపించకుండా పోయింది. పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతకగా ఆచూకి లభించలేదు. పాఠశాలకు వెళ్లి విచారించగా ఇద్దరు పిల్లలను తీసుకెళ్లినట్లు తెలపడంతో తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భర్త మరణించడంతో తండ్రి వద్దే ఉంటున్న ఆమె ఉన్నట్టుండి కనిపించకుండా పోవడంతో తండ్రి ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బస్సు డ్రైవర్లకు అవగాహన

మంగళగిరి: రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బస్సులు నడపాలని రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు. గురువారం మండలంలోని నీరుకొండలో కల ఎస్ఆర్‌ఎం యూనివర్శిటీలో బస్సు డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్ఐ వెంకట్ మాట్లాడుతూ వర్సిటీ బస్సులను రెండు మూడు సార్లుగా నడపాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బస్సులు నడపాలన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

మేడికొండూరు: మండల యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు అందరూ పాల్గొని ఏకగ్రీవ ఎన్నిక చేపట్టారు. గౌరవ అధ్యక్షుడిగా పేరేచర్ల ఎస్‌ఏఎస్‌ఎస్ జెడ్పీ హెచ్‌ఎస్‌కు చెందిన జి.శివ పూర్ణయ్య, అధ్యక్షుడిగా మేడికొండూరు ఎస్‌ఏ పీ ఎస్ జెడ్పీ హెచ్‌ఎస్‌కు చెందిన కె.శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా మందపాడు ఎస్‌ఏపీఎస్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షులుగా సిరిపురం ఎస్‌ఏ ఎస్ఎస్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన జె.సామ్రాజ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కొరప్రాడు ఎంపీపీ ఎస్, హెచ్‌ఈకు చెందిన గోపయ్య, ఆర్థిక కార్యదర్శిగా ఎస్ పాండురంగారావు, కన్వీనర్‌గా వి. రామయ్యను నూతన కమిటీగా ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. నూతనంగా ఏర్పడిన యూటీఎఫ్ మండల కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.